క్లుప్తంగా

రైతు బజార్లలో కూరగాయల ధరలు

వనస్థలిపురం: సరూర్‌నగర్/వనస్థలిపురం రైతుబజార్లలో కూరగాయల ధరలు... (కిలో... రూపాయల్లో) టమాటా 19, వంకాయ 28, బెండ 18, పచ్చిమిర్చి 55, కాకర 23, బీర 18, క్యాబేజీ 15, ఫ్రెంచిబీన్స్ 75, క్యారెట్ 40, దొండ 13, చిక్కుడు 35–45, గోకర 28, బీట్‌రూట్ 25, క్యాప్సికం 50, ఆలు 21, దోస 13, సార 11, పొట్ల 13, ఉల్లిగడ్డ 34, చామగడ్డ 37. ఈ ధరలు గురువారం ఉదయం 9 గంటల వరకు మాత్రమే అమలులో ఉంటాయి.

అస్తవ్యస్తంగా వీధి దీపాల నిర్వహణ



వనస్థలిపురం శ్రీనివాసపురం కాలనీలో పగటి పూట వెలుగుతున్న వీధి దీపం

వనస్థలిపురం: ఎల్‌బీనగర్ సర్కిల్ పరిధిలోని పలు కాలనీలలో వీధి దీపాల నిర్వహణ అస్తవ్యస్తంగా తయారైంది. పలు ప్రాంతాలలో రాత్రి పూట వెలగాల్సిన వీధి దీపాలు పగలు కూడా వెలుగులు విరజిమ్ముతున్నాయి. ఉదయం వేళ సకాలంలో వీధి దీపాలను ఆర్పివేయడంలో జీహెచ్‌ఎంసీ సిబ్బందితో పాటు కాలనీ సంక్షేమ సంఘాలు నిర్లక్ష్యం చేస్తున్నాయి. దీంతో విలువైన విద్యుత్ వృథా అవుతోంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి కాలనీలలో పగటి పూట వీధి దీపాలు వెలగకుండా తగిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

నేడు బీజేపీ శక్తి కేంద్రం ఇన్‌ఛార్జ్‌ల సమావేశం

నాగోలు: నాగోలు డివిజన్ బీజేపీ శక్తి కేంద్రం ఇన్‌చార్జ్‌లు, బూత్ అధ్యక్షులు సమావేశంలో గురువారం సాయంత్రం 5 గంటలకు డివిజన్ పరిధిలోని శుభం కన్వెన్షన్‌లో నిర్వహిస్తామని నాగోలు డివిజన్ కార్పొరేటర్ చింతల అరుణ సురేంద్రనాథ్ యాదవ్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథులుగా ఎల్‌బీనగర్ నియోజకవర్గం బీజేపీ ఇన్‌ఛార్జి, కర్ణాటక ఎమ్మెల్యే మునిరత్నం నాయకులు, రంగారెడ్డి జిల్లా అర్బన్ అధ్యక్షుడు సామ రంగారెడ్డి పాల్గొంటారని వారు తెలిపారు. సమావేశంలో అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ బూత్ అధ్యక్షుడు, పార్టీ నాయకులను దిశా నిర్దేశం చేస్తారన్నారు. పార్టీ నాయకులు, బూత్ ఇన్‌ఛార్జ్‌లు సమావేశానికి సకాలంలో హాజరు కావాలని సూచించారు.

అక్రమంగా తరలిస్తున్న మద్యం పట్టివేత



నిందితులు, పోలీసులు స్వాధీనం చేసుకున్న మద్యం బాటిళ్లు

నాగోలు: అక్రమంగా మద్యం తరలిస్తున్న ఇద్దరిని నాగోలు పోలీసులు అరెస్టు చేసి వారి వద్ద నుంచి 24 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల కథనం ప్రకారం.. నాగోలుకు చెందిన రామకృష్ణ, మేడ్చల్‌కు చెందిన మనోజ్ బుధవారం రాత్రి ద్విచక్ర వాహనంపై మద్యం బాటిళ్లను అక్రమంగా తరలిస్తూ నాగోలు చౌరస్తాలో వాహన తనిఖీలు చేస్తున్న పోలీసులకు పట్టుబడ్డారు. వీరి వద్ద నుంచి రూ. 49,440 విలువైన 24 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. ఇద్దరినీ అరెస్టు పోలీసు స్టేషన్ తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ట్రెండ్ మార్చిన పోలీస్

- నేరుగా రౌడీషీటర్ల ఇంటికి వెళ్లి కౌన్సెలింగ్
- సౌత్‌ఈస్ట్ జోన్ డీసీపీ రోహిత్ రాజుకు ప్రజల ప్రశంసలు



మాదన్నపేట పీఎస్ పరిధిలో పర్యటిస్తున్న డీసీపీ రోహిత్ రాజు

చంచల్‌గూడ: ముఖ్యమైన పండుగలు, ఎన్నికల వేలల్లో సాధారణంగా పోలీసు శాఖ రౌడీషీటర్లపై ప్రత్యేక దృష్టి పెడుతుంది. వారి కదలికలపై ఎప్పటికప్పుడు సమాచారం సేకరిస్తుంది. రౌడీషీటర్లను పోలీసు స్టేషన్‌కు పలిపించి వారిని హెచ్చరించడంతో పాటు కౌన్సిలింగ్ ఇస్తుంటారు. కానీ అందుకు భిన్నంగా పోలీసులే రౌడీషీటర్ల ఇంటికి వెళ్లి కౌన్సిలింగ్ ఇవ్వడం విశేషం. ఇటీవల కొత్తగా సౌత్‌ఈస్ట్ జోన్ డీసీపీగా బాధ్యతలు చేపట్టిన బిరుదరాజు రోహిత్ రాజు తన పరిధిలోని అన్ని పోలీసు స్టేషన్‌లో పర్యటించి అక్కడి పరిస్థితులను తెలుసుకుంటున్నారు. ఇదే క్రమంలో మాదన్నపేట పీఎస్ పరిధిలో ఉన్న రౌడీషీటర్ల ఇంటికి ఆయనే నేరుగా వెళ్లి కౌన్సిలింగ్ ఇవ్వడంతో డీసీపీ పనితీరుపై ప్రజలు ప్రసంశలు కురిపిస్తున్నారు. పోలీసులు నేరుగా రౌడీషీటర్ల ఇంటికి వెళ్లి కౌన్సిలింగ్ ఇచ్చే సరికొత్త పద్ధతికి రోహిత్ రాజు నాంది పలికారని పలువురు పేర్కొంటున్నారు. పోలీసులకు ప్రజల సహకారం ఉంటే నేరాలు చాలా వరకు తగ్గుముఖం పడతాయని డీసీపీ పేర్కొన్నారు.

‘ఆయుష్మాన్ భారత్’తో పేదలకు ఎంతో మేలు



కొత్తపేటలో ఆయుష్మాన్ భారత్ డిజిటల్ కార్డులు పంపిణీ చేస్తున్న కార్పొరేటర్

నాగోలు: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆయుష్మాన్ భారత్ పథకం వల్ల నిరుపేదలకు ఎంతో ఉపయోగపడుతుందని కొత్తపేట డివిజన్ కార్పొరేటర్ నాయికోటి పవన్‌కుమార్ అన్నారు. డివిజన్ పరిధిలోని భరత్‌నగర్ ఫేజ్–1లో, శివమ్మనగర్ కాలనీలో ఆయుష్మాన్ భారత్ పథకానికి దరఖాస్తు చేసుకున్న వారందరికీ బుధవారం పవన్ కుమార్ చేతుల మీదుగా నూతన డిజిటల్ కార్డులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ... ఏదైనా ఆరోగ్య సమస్య వచ్చి ఆసుపత్రిలో చేరితే ఆయష్మాన్ భారత్ కార్డు ద్వారా కేంద్రం వారికి రూ. 5 లక్షల వరకు ఉచితంగా వైద్యసేవలు పొందవచ్చని ప్రజలకు తెలియజేశారు. కార్యక్రమంలో భరత్‌నగర్ కాలనీ ఫేజ్–1 అధ్యక్షుడు కొర్లపల్లి స్వామి, మంచి రాజేష్ పాల్గొన్నారు.

డీసీపీ కార్యాలయాన్ని సందర్శించిన నగర సీపీ

సైదాబాద్: సౌత్‌ఈస్ట్ జోన్ డీసీపీ కార్యాలయాన్ని నగర పోలీస్ కమిషనర్ సందర్శించారు. సైదాబాద్ చౌరస్తాలోని డీసీపీ కార్యాలయానికి బుధవారం చేరుకున్న సీపీ సందీప్ శాండిల్యా జోన్ పరిధిలో శాంతిభద్రతల పరిస్థితిపై డీసీపీ రోహిత్ రాజును ఆరా తీశారు. జోన్‌లోని రౌడీషీటర్ల కదలికలపై తీసుకుంటున్న చర్యలను అడిగి తెలుసుకున్నట్లు తెలుస్తోంది. డీసీపీ కార్యాలయంలో గంటన్నర సేపు ఉన్న కమిషనర్ జోన్ పరిధిలో జరుగుతున్న అన్ని వ్యవహారాలపై పూర్తి వివరాలు సేకరించినట్లు సమాచారం.

ట్రంక్‌లైన్ మరమ్మతులు పట్టవా?



పద్మావతి కాలనీలో కుంగిపోయిన ట్రంక్‌లైన్ మ్యాన్‌హోల్‌ను పరిశీలిస్తున్న కార్పొరేటర్ జీవన్‌రెడ్డి

అధికారుల నిర్లక్ష్యంపై కార్పొరేటర్ ఆగ్రహం

హయత్‌నగర్: నెలలు గడుస్తున్నా డ్రైనేజీ ట్రంక్ లైన్‌కు మరమ్మతులు చేయక పోవడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందుల ఎదుర్కొంటున్నారని, ఈ విషయంలో అధికారులు ఎందుకు నిర్లక్ష్యం చేస్తున్నారో చెప్పాలని హయత్‌నగర్ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం ఆయన పద్మావతి కాలనీలో కృంగి పోయిన ట్రంక్‌లైన్ మ్యాన్‌హోల్‌ను పరిశీలించారు. నెలలు గడుస్తున్నా ఎందుకు ఈ మ్యాన్‌హోల్‌కు మరమ్మతులు చేయడం లేదని, ప్రజల సమస్యలపై అధికారులు బాధ్యత తీసుకోవడం లేదని ఆరోపించారు. అధికారుల నిర్లక్ష్యం కారణంగా కాలనీ వాసులతో పాటు వాహనదారులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ట్రంక్ లైన్ మ్యాన్‌హోల్‌కు మరమ్మతులు చేయాలని డిమాండ్ చేశారు.

భక్తిశ్రద్ధలతో అమ్మవారి నిమజ్జనం

దిల్‌సుఖ్‌నగర్: దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు ఘనంగా ముగియడంతో బుధవారం మలక్‌పేట జోన్ పరిధిలోని మండపాల్లో ప్రతిష్ఠించిన అమ్మవారి విగ్రహాలను బుధవారం భక్తిశ్రద్ధలతో నిమజ్జనం చేశారు. ఉత్సవాల ముగింపు నేపథ్యంలో దిల్‌సుఖ్‌నగర్, సరూర్‌నగర్, మలక్‌పేట, కుర్మగూడ, చాదర్‌ఘాట్, ఆర్‌కేపురం, సలీంనగర్ తదితర ప్రాంతాల్లోని ఆలయాలు, దుర్గాదేవి మండపాలు భక్తులతో కిటకిటలాడాయి. అమ్మవారిని పట్టు వస్త్రాలు, పసుపు, కుంకుమ, పూలతో అందంగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. పులిహోర, దద్దోజనం, శనగలు, రవ్వ కేసరి, పరమాన్నంతో పాటు వివిధ రకాల వంటకాలను నైవేద్యంగా సమర్పించారు. అన్ని ప్రాంతాల్లోని దుర్గామాత విగ్రహాల నిమజ్జన ఊరేగింపులు కొనసాగాయి. ఈ సందర్భంగా కార్యక్రమంలో ఆలయాల నిర్వాహకులు, మండపాల నిర్వాహకులు పాల్గొన్నారు.

అలయ్ బలయ్‌లో పాల్గొన్న నేతలు

చాదర్‌ఘాట్: తెలంగాణ సాంప్రదాయానికి ప్రతీక అయిన అలయ్ బలయ్‌ని 17 ఏళ్లుగా బండారు దత్తాత్రేయ ఆధ్వర్యంలో నిర్వహించడం గొప్ప విషయమని కొమిరెల్లి రాజశేఖర్ రెడ్డి అన్నారు. బుధవారం నగరంలో నిర్వహించిన అలయ్ బలయ్ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాజీ ఎమ్మెల్సీ రామచంద్రరావును కలిశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, అలయ్ బలయ్‌లో పాల్గొనడం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో చీపురు రాజారావు, బేతరి రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

ఆయనపై అనుచిత పోస్టులు పెట్టవద్దు

సురేందర్‌రెడ్డిపై సామాజిక మాధ్యమాలలో ఆరోపణలు చేసిన వారికి కోర్టు ఆదేశం

సైదాబాద్: బీజేపీ భాగ్యనగర్ జిల్లా అధ్యక్షుడు సంరెడ్డి సురేందర్‌రెడ్డి పరువుకు భంగం కలిగించేలా సోషల్ మీడియాలో ఎలాంటి అనుచిత పోస్టులు పెట్టరాదని సంబంధిత వ్యక్తులకు బుధవారం సిటీ సివిల్ కోర్ట్ ఆదేశించింది. ఈ సందర్భంగా సైదాబాద్‌లో ఆయన మాట్లాడుతూ, వానరసేన అనే సంస్థకు చెందిన వ్యక్తులు కొందరు వాట్సప్, ఫేస్‌బుక్ తదితర సామాజిక మాధ్యమాలలో తనపై అసత్య ఆరోపణలు చేస్తూ సమాజంలో తన పరువు తీయడానికి యత్నించారన్నారు. వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని కోరుతూ సైబర్ క్రైమ్స్ అధికారులకు ఈనెల 11న ఫిర్యాదు చేశానని సురేందర్‌రెడ్డి తెలిపారు. అదేవిధంగా తన పరువుకు నష్టం కలిగించిన వారిపై న్యాయస్థానంలో పిటీషన్ వేశానని వివరించారు. అందుకు కోర్టు వారు తనపై మరలా సోషల్ మీడియాలో లేదా.. సమావేశాలలో ఎక్కడా కూడా అనుచిత పోస్టులు చేయవద్దని ఆదేశించింది అని తెలిపారు. వ్యక్తిగతంగా, రాజకీయంగా తనపై దుష్ప్రచారం చేసిన వారిపై న్యాయపరంగా, చట్టపరంగా తగిన చర్యలు తీసుకుంటానని ఆయన ఈ సందర్భంగా అన్నారు.

యథేచ్ఛగా రోడ్ల వెంబడి చెత్త పారబోత

- పట్టించుకోని శానిటేషన్ అధికారులు
- దుర్వాసనతో స్థానికుల ఇక్కట్లు



వనస్థలిపురం డివిజన్ వెంకటరమణ కాలనీలో రోడ్డు వెంబడి పేరుకుపోయిన చెత్త

వనస్థలిపురం: కాలనీల్లో పారిశుద్ధ్య పనుల నిర్వహణ అధ్వానంగా తయారవుతోంది. కాలనీల్లో రోడ్ల వెంబడి చెత్తకుప్పలు పేరుకుపోతున్నాయి. పలు ప్రాంతాల్లో ఇళ్లల్లో నుంచి చెత్తను కవర్లలో తీసుకువచ్చి రోడ్ల పక్కన పడేసి పోతున్నారు. దీంతో ఆ స్థలాలలో కుక్కలు సంచరిస్తూ చెత్తలో ఆహారం కోసం వెతుకుతూ పరిసరాలను అపరిశుభ్రంగా మారుస్తున్నాయి. దుర్వాసన వస్తుండటంతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. రోడ్లపై చెత్త వేసేవారిని గుర్తించి, కౌన్సెలింగ్ ఇవ్వాల్సిన శానిటేషన్ అధికారులు తమకేమి పట్టనట్టుగా వ్యవహరిస్తున్నారు. హోటళ్ల నుంచి నెల మామూళ్లు తీసుకుంటూ వారి చెత్తను డంపింగ్ ప్రాంతాలకు తరలిస్తున్న అధికారులు రోడ్ల వెంబడి పేరుకుపోతున్న చెత్తను పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా శానిటేషన్ అధికారులు స్పందించి రోడ్లపై చెత్తను వేయకుండా అడ్డుకోవాలని, అలాగే పేరుకుపోయిన చెత్తకుప్పలను ఎప్పటికప్పుడు డంపింగ్‌యార్డుకు తరలించేందుకు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేలా చర్యలు

వనస్థలిపురం ఏసీపీ భీంరెడ్డి



ప్రత్యేక బలగాలకు సూచనలు చేస్తున్న సీఐ జలేంధర్‌రెడ్డి

హస్తినాపురం: వనస్థలిపురం పోలీస్‌స్టేషన్ పరిధిలోని సమస్యాత్మక ప్రాంతాలలో పోలింగ్ బూత్‌లను పరిశీలించడానికి సీఐఎస్‌ఎఫ్ 252 కోడ్ కంపెనీకి చెందిన 38 మంది పోలీసులు ఏసీపీ భీంరెడ్డి పర్యవేక్షణలో సీఐ జలేంధర్‌రెడ్డి ఆధ్వర్యంలో పర్యటించారు. ఈ సందర్భంగా వనస్థలిపురం ఏసీపీ మాట్లాడుతూ, ఎన్నికలు ప్రశాంతవాతావరణం జరిగేందుకు, ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా తగిన చర్యలు తీసుకుంటున్నామన్నారు. చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే సహించేదిలేదని, చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వనస్థలిపురం పోలీస్ స్టేషన్ పరిధిలో సమస్యాత్మక పోలింగ్ బూత్‌లు 16 ఉన్నాయని, ఆయా ప్రాంతాలలో ఎలాంటి ఇబ్బందులు కలగకుండా శాంతయుతంగా ఓటింగ్ జరిగే విధంగా చర్యలు తీసుకుంటామని ఆయా ప్రాంతాల ప్రజలకు భరోసా కల్పించనున్నట్లు ఏసీపీ భీంరెడ్డి వెల్లడించారు. వనస్థలిపురం పోలీస్‌స్టేషన్ పరిధిలో గత ఎన్నికలలో అల్లర్లకు పాల్పడిన వారిని బైండోవర్ చేశామన్నారు. ఓటర్లు ధైర్యంగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో వనస్థలిపురం సీఐ జలేంధర్‌రెడ్డి, సీఐఎస్‌ఎఫ్ ఇన్‌స్పెక్టర్ జయకుమార్ రాణా, ఎస్‌ఐలు మాధవరెడ్డి, జగన్, రవి తదితరులు పాల్గొన్నారు.

వనస్థలిపురంలో విస్తృతంగా వాహన తనిఖీలు



వాహనాలను తనిఖీ చేస్తున్న సీఐ జలేంధర్‌రెడ్డి

హస్తినాపురం: సార్వత్రిక ఎన్నికల సందర్భంగా వనస్థలిపురం పోలీస్‌స్టేషన్ పరిధిలోని అనేక ప్రాంతాలలో పోలీసులు ఎక్కడికక్కడ ఆకస్మిక తనిఖీలు చేస్తున్నారు. వనస్థలిపురం ఇన్‌స్పెక్టర్ జలేంధర్‌రెడ్డి ఆధ్వర్యంలో అటు విజయవాడ జాతీయ రహదారితో పాటు.. ఇటు నాగార్జునసాగర్ రహదారిపై విస్తృతంగా తనిఖీలు నిర్వహిస్తున్నారు. బృందాలుగా విడిపోయి జాతీయ రహదారులే కాకుండా కాలనీల రహదారులను సైతం వదలకుండా తనిఖీలు చేపడుతున్నారు. బుధవారం వనస్థలిపురం పోలీస్‌స్టేషన్ పరిధిలోని చాలా ప్రాంతాలలో వాహన తనిఖీలు చేశారు. కార్యక్రమంలో ఎస్‌ఐలు నర్సింగ్‌రాథోడ్, రవి, మాధవరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఉప్పల్‌లో భారీగా మద్యం స్వాధీనం



మద్యం బాటిల్స్‌ను స్వాధీనం చేసుకున్న ఎక్సైజ్ పోలీసులు

ఉప్పల్: ఇంట్లో మద్యం నిల్వ ఉంచుకొని అధిక రేట్లకు విక్రయిస్తున్న బెల్టు షాపుపై ఉప్పల్ ఎక్సైజ్ పోలీసులు దాడి చేసి వారి వద్ద నుంచి భారీగా మద్యం స్వాధీనం చేసుకున్న ఘటన ఉప్పల్ పోలీస్ స్టేషన్ పరిధి కొత్తపేటలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కొత్తపేట సౌభాగ్యనగర్ వీధి నంబర్–4, ప్లాట్ నంబర్–151లో నివాసముంటున్న ఒ.దానమ్మ(60) మద్యాన్ని కొనుగోలు చేసి ఇంట్లో అక్రమంగా నిల్వ ఉంచుకుని అధిక రేట్లకు విక్రయిస్తున్నారన్న సమాచారం అందుకున్న ఎక్సైజ్ పోలీసులు గురువారం ఆకస్మికంగా దాడి చేశారు. ఇంట్లో లభ్యమైన దాదాపు రూ.1,56,690 విలువ చేసే వివిధ బ్రాండ్ల మద్యం సీసాలు, రూ.27,300 విలువ గల బీరు బాటిల్స్‌ను స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

స్ట్రీట్ ఫుడ్‌కు పెరుగుతున్న ఆదరణ



మెహిదీపట్నంలోని ఓ స్ట్రీట్ ఫుడ్ సెంటర్‌లో భోజనం చేస్తున్న దృశ్యం

గోల్కొండ: స్ట్రీట్ ఫుడ్ వ్యాపారానికి మళ్లీ మంచి రోజులు వచ్చాయి. కరోనా మహమ్మారి తరువాత స్ట్రీట్ ఫుడ్ దాదాపు కనుమరుగయ్యాయి. గిరాకీ లేక మెహిదీపట్నం, టోలిచౌకి తదితర ప్రాంతాలలోని ఫుట్‌పాత్ ఫుడ్ కోర్టులు ఒక్కసారిగా మూతపడ్డాయి. అయితే లేబర్ అడ్డాలలో కూలీల సంఖ్య పెరగడంతో పాటు ప్రైవేటు ఉద్యోగులు పెరిగారు. దీంతో మూతపడ్డ ఫుడ్ పాయింట్లు ఒకొక్కటిగా తెరుచుకుంటున్నాయి. మెహిదీపట్నం బస్టాప్‌తో పాటు టోలిచౌకీ చౌరస్తా వద్ద గత కొంత కాలంగా భోజనం అందించే ఫుడ్ కోర్టుల సంఖ్య బాగా పెరిగింది. మెహిదీపట్నంలో సిటీ బస్సుల రాకపోకలు పెరగడం, ప్రైవేటు ఉద్యోగుల సంఖ్య కూడా పెరిగింది. వీరితో చాలా మంది మధ్యాహ్న భోజనాలకు ఫుడ్‌కోర్టులకు వస్తుంటారు. అదే విధంగా టోలిచౌకీ లేబర్ అడ్డా వద్ద ప్రతి నిత్యం ఉదయం నుంచి రాత్రి వరకు వేల సంఖ్యలో దినసరి కూలీలు ఉంటారు. రుచికరమైన భోజనం అందుబాటు ధరలోనే అందుబాటులో ఉండడంతో దినసరి కూలీలు, ప్రైవేటు ఉద్యోగులు ఇక్కడే భోజనం చేస్తున్నారు. దాల్ ఖానా, పాపడ్ 50 రూపాయలు, దాల్ చికెన్, చావల్ 70 రూపాయలకే ఇస్తున్నారు.

‘హస్తం’లో స్తబ్దత

- అభ్యర్థులను ప్రకటించిన గులాబీ, కమలం పార్టీ
- ఆచితూచి అడుగులేస్తున్న హస్తం నేతలు
- ప్రచారంలో జోరు పెంచిన పార్టీలు
- ఓటర్లను ఆకట్టుకునేందుకు అభ్యర్థుల పాట్లు



మహేశ్వరం: ఎన్నికల నగరామోగడంతో నియోజకవర్గంలో రాజకీయాలు ఒక్కసారిగా వేడెక్కాయి. శాసనసభ ఎన్నికలను ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న గులాబీ పార్టీ నోటిఫికేషన్ కంటే ముందే అభ్యర్థులను ప్రకటించింది. ఆలస్యంగానైనా కాంగ్రెస్, బీజేపీలు మొదటి విడత అభ్యర్థుల జాబితాను ప్రకటించాయి. మహేశ్వరం నియోజకవర్గంలో బీఆర్‌ఎస్, బీజేపీ అభ్యర్థులను ఖరారు చేశారు. ఈ రెండు పార్టీలు దూసుకుపోతుంటే హస్తం పార్టీ మాత్రం అభ్యర్థి ఎంపికలో మల్లగుల్లాలు పడుతోంది.

జోరుపెంచిన సబితారెడ్డి

మంత్రి సబితారెడ్డి నియోజకవర్గంలోని మహేశ్వరం, కందుకూరు, బాలాపూర్, సరూర్‌నగర్ మండలాల్లో విస్తృతంగా పర్యటిస్తూ ప్రచారం హోరెత్తిస్తున్నారు. మండలాలు, డివిజన్లు, కార్పొరేషన్లతో పాటు కులసంఘాలతో ఆత్మీయ సమ్మేళనాలు, సభలు నిర్వహిస్తూ తనకు మద్దతుగా నిలవాలని కోరుతున్నారు. అసంతృప్తి నేతలతో మంత్రి తనయుడు కార్తీక్‌రెడ్డి నేరుగా సంప్రదింపులు చేస్తున్నారు. తల్లీ కొడుకులు కాంగ్రెస్ నేతలపై ఆపరేషన్ ఆకర్ష్‌ను ప్రయోగిస్తున్నారు. దసరా సందర్భంగా సబితారెడ్డి అన్నీ మండలాలు, డివిజన్లతో పర్యటించి బతుకమ్మ, శరన్నవరాత్రి ఉత్సవాల్లో కూడా పాల్గొన్నారు. అందరికీ అందుబాటులో ఉంటూ ప్రచారంలో ముందంజలో ఉన్నారు.

నియోజకవర్గాన్ని చుట్టేస్తున్న అందెల

మహేశ్వరం నుంచి బీజేపీ మరోసారి అందెల శ్రీరాములుకు అవకాశం ఇచ్చింది. ఆ పార్టీ ప్రకటించిన మొదటి జాబితాలో అందెలకు చోటు ఖరారు చేశారు. 2018 ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థిగా పోటీ చేసి 39,449 ఓట్లు సాధించి మూడవ స్థానానికి పరిమితమయ్యారు. అధిష్టానం తనకే సీటు కేటాయిస్తుందని ముందే పసికట్టిన ఆయన.. నియోజకవర్గంలో కలియతిరుగుతున్నారు. టికెట్ ఆశించి భంగపడ్డ నేతలను నేరుగా కలుస్తున్నారు. మద్దతు ఇవ్వాలని కోరుతున్నారు. తూళ్ల వీరేందర్ గౌడ్, బొక్క నర్సింహారెడ్డి, సుదర్శన్‌రెడ్డి, బస్వ పాపయ్య, సుధాకర్ శర్మ, జంగయ్య యాదవ్, శంకర్‌రెడ్డిలతో పాటు పలువురు నేతలను కలిసి.. తనకు మద్దతు ఇచ్చి పార్టీ గెలుపు కోసం కృషి చేయాలని కోరుతున్నారు.

కాంగ్రెస్‌లో పోటీ

కాంగ్రెస్ టికెట్ కోసం నేతల మధ్య పోటీ తీవ్రంగా ఉండడంతో మహేశ్వరం టికెట్‌ను మొదటి జాబితాలో అధిష్టానం ప్రకటించలేదు. సబితారెడ్డిపై బలమైన అభ్యర్థిని బరిలో నిలబెట్టాలని ఆ పార్టీ నేతలు భావిస్తున్నారు. అందువల్ల అభ్యర్థి ఎంపికలో ఆచితూచి అడుగులు వేస్తున్నారు. సర్వేల ఆధారంగా అభ్యర్థుల ఎంపిక చేస్తామని చెప్పడంతో స్తబ్దత నెలకొంది. టికెట్ ఆశిస్తున్న వారిలో బడంగ్‌పేట్ మేయర్, పీసీసీ ప్రధాన కార్యదర్శి చిగురింత పారిజాత, డీసీసీ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు దేప భాస్కర్‌రెడ్డి, ఎనుగు జంగారెడ్డి ఉన్నారు. కాంగ్రెస్ వ్యూహకర్త సునీల్ కనుగోలు నియోజకవర్గంలో చేపట్టిన సర్వేలో చిగురింత పారిజాత పేరు ముందంజలో ఉండడంతో తనకే టికెట్ వస్తుందనే ధీమాతో ఆమె ఉన్నారు. చల్లా నర్సింహారెడ్డి, దేప భాస్కర్‌రెడ్డి కష్టకాలంలో పార్టీని నిలబెట్టామని, తమకు టికెట్ ఇవ్వాలని అధిష్టానాన్ని కోరుతున్నారు. వీళ్లంతా టికెట్ కోసం పీసీసీ, ఏఐసీసీ, సీఎల్పీ స్థాయిలో ప్రయత్నాలు చేస్తున్నారు. కాంగ్రెస్ రెండో జాబితాను రెండు మూడు రోజుల్లో ప్రకటించే అవకాశం ఉండడంతో ఆశగా ఎదురు చూస్తున్నారు.

ఎన్నికల తనిఖీల్లో రూ.3.49 కోట్లు పట్టివేత

- అన్ని పత్రాలు ఉన్నందున రూ.2.11 కోట్లు ఇచ్చేశాం..
- జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ గౌతమ్



సాక్షి, మేడ్చల్ జిల్లా: ఎన్నికల నేపథ్యంలో మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో పలుచోట్ల తనిఖీలు, చెక్‌పోస్టుల వద్ద పోలీసులు రూ.3,49,92,241 స్వాధీనం చేసుకోగా, జిల్లా గ్రీవెన్స్ కమిటీ(ఫిర్యాదుల కమిటీ) వీటికి సంబంధించిన అన్ని రకాల ధ్రువపత్రాలను పరిశీలించిన తర్వాత రూ.2,11,80,761లను తిరిగి అందజేసినట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ గౌతమ్ తెలిపారు. ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చినప్పటి నుంచి చెక్‌పోస్టుల వద్ద భారీకేడ్లను ఏర్పాటు చేసి తనిఖీలతో ప్రత్యేకంగా నిఘా పెడుతున్నట్లు ఆయన తెలిపారు. ఈ నెల 24(మంగళవారం) వరకు జిల్లావ్యాప్తంగా 104 కేసులకు సంబంధించి రూ.3,49,92,241లు ఉండగా అందులో 70 కేసులకు సంబంధించి సరైన ఆధారాలు, ధ్రువపత్రాలు సమర్పించిన నేపథ్యంలో జిల్లా గ్రీవెన్స్ కమిటీ పరిశీలన అనంతరం రూ.2,11,80,761లను తిరిగి అప్పగించినట్లు తెలిపారు. ఐదు కేసులకు సంబంధించి ఎఫ్‌ఐఆర్ నమోదు కాగా, అందుకు సంబంధించిన నగదు రూ.28.18 లక్షలు ఉన్నాయన్నారు. సెక్యూరిటీ ఇతర దరఖాస్తులకు సంబంధించి 34 పెండింగ్‌లో ఉండగా, దీనికి సంబంధించి రూ.1,09,93,480లకు ధ్రువీకరణ పత్రాలు అందజేయాల్సి ఉందని ఆయన తెలిపారు. ఈ విషయంలో కేసుల విచారణ జరుగుతోందని, వాటిని కూడా త్వరగా పరిష్కరించేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నట్లు స్పష్టం చేశారు. సామాన్య ప్రజలు ఇబ్బందులకు గురి కావద్దనే ఉద్దేశంతో స్వాధీనం చేసుకున్న సొత్తు పరిశీలన కోసం జిల్లా ఫిర్యాదుల కమిటీ (గ్రీవెన్స్ కమిటీ)ని ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళిని అనుసరించి రూ.50 వేల కంటే ఎక్కువ నగదు తరలించవద్దని, ఈ విషయంలో అధికారులకు సహకరించాలని ఆయన పేర్కొన్నారు. జిల్లా గ్రీవెన్స్ కమిటీలో కన్వీనర్ జిల్లా సహకార అధికారి శ్రీనివాసమూర్తి(91001 15724), సభ్యులుగా డీటీవో నర్సింహారావు (77999 34204) జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారి పద్మజారాణి (73309 99280) వ్యవహరిస్తున్నారని, ఏవైనా సమస్యలు ఉంటే కమిటీని సంప్రదించాలని పేర్కొన్నారు.